వెనుక గదిలో అప్పుడో దొంగ ఆమె ఉన్న గదిలోకి వచ్చాడు పెద్ద పెద్దమీసాలున్నాయి బుగ్గకి సన్నటి జీర వుంది మొలల్లోంచి కత్తి తీసి ఆమె మెడకు ఆన్చి బీరువా తాళాలు ఎక్కడున్నాయ్? అని అడిగాదు బొంగురు గొంతుతో ఒకప్పుడైతే స్పృహ తప్పి పడిపోయేది కానీ ఇప్పుడు ఆమె పెదవుల మీద సన్నగా నవ్వు వెలిసింది. తాయెత్తు పైట చాటున వుంది దాన్ని కాస్త బయటకొచ్చెలా చేస్తే చాలు. అప్పుడీ దొంగ ఎంత వేగంగా ఇక్కడనుంచి పరుగెడ్తాడు? అనుకుంది.

ఈ లోపులో వాడు తొందరగా తాళాల సంగతి చెప్పు అని దగ్గర కొస్తూ మళ్ళీ బెదిరించాడు. ఆమె అతడిని క్షమిస్తున్నట్టు తెలిగ్గా చూసి భుజం కాస్త విదిలించి మెడ క్రిందుగా చెయ్యిపోనిచ్చింది. ఆమె జాకెట్ లోపల తాళాలు దాచుకుందేమో అని దొంగ అనుకున్నాడు కానీ ఆమె హఠాత్తుగా పైట క్రిందనుంచి తాయెత్తు తీసి అతడి కళ్ళముందు ఆడించింది.

ఆ దొంగ ఒక్కసారిగా సర్వశక్తులు నశించి భయం ఆవహించి కృంగిపోయి పిల్లిలా అక్కడ నుంచి పరుగెడ్తాడేమో అనుకుంది.

కానీ అటువంటిదేమీ జరగలేదు.

తాళాలు తాళాలు తియ్ అన్నాడు కత్తి మెడ మీద ఆనుస్తూ ఆ విదిలింపుకి ఆమె చెయ్యి గీరుకుంది. మరొక్కసారి తాయెత్తు వేపు అతడి మొహంవైపు చూసింది వాడిలో మార్పేమీలేదు కాళ్లవైపు మొహం వైపు చూస్తే పార్టీ మార్చేయడానికి వాడేమీ రాజకీయ నాయకుడు కాదు కద అంతకన్నా కాస్త మంచి ప్రొఫెషన్ అయిన దొంగతనం అనే వృత్తిలో వున్నవాడు. డబ్బుకోసం మాత్రమే వృత్తి చేపట్టినవాడు

తన తాయెత్తు అందర్నీ భయపెట్టినట్టు ఆ దొంగని భయపెట్టడం లేదని అర్థం అవగానే ఆమె మామూలు సునాదమాల అయిపోయింది. ఒక్క ఉదుటున భయంతో లోపలికి పరిగెత్తింది. దొంగ ఆమె వెంట పడ్డాడు. ఆమె వంటింట్లోకి దూరి తలుపు వేసెయ్యబోయింది. కానీ వాడి బలం ముందు అవి ఆగలేదు. వాడు కూడ లోపలకు ప్రవేశించాడు. చేటలో బియ్యం వుంటే వాడి మొహంమీద కొట్టింది. టమోటా పళ్లు పక్కనుంటే విసిరేసింది కానీ వాడు మీద మీదకు రాసాగాడు..... ఆమె జాకెట్‌లోనే తాళాలు దాచుకుందేమో అని వాడికి నిశ్చయమైపోయింది. కేవలం వృత్తిమీద వుండే గౌరవం వల్ల తాళాలు తాళాలు అని ఆక్రోశిస్తున్నాడే తప్ప మరోకడైతే తాళాలకన్నా ఆ తాళాలుండే స్థానం పట్లే ఈ పాటికి ఎక్కువ మక్కువ చూపి వుండేవాడు.

ఆమె ఎలాగో అతడి నుంచి తప్పించుకుని వంటింట్లోంచి బయటకు పారిపోయి వచ్చి అదే వూపులో ముందు గది తలుపును తీసింది.

బైట రోడ్డు మీదకు పరుగెత్తబోయేది కానీ గుమ్మం దగ్గిర మరో ఆకారం నిలబడి వుంది. ఆమె కెవ్వున అరవబోయి అది తెలిసిన పోలికలు గలదై వుండడంతో బలవంతాన కేకని ఆపుకుంది.

ఆ ఆకారం నిరంజన్ ది!

రేపు ద్వాదశి రేపట్లోగా మీరు ఐ లవ్యూ అనకపోతే మీ ఇంటి ఎదురుగా ఉరేసుకుని చచ్చిపోతాను అంటూ సాయంత్రం నుంచీ ఇంటి ముందు కిళ్ళీ షాపు దగ్గర నిలబడి వున్న విహారి ఆ సమయంలో కనబడటం ఆమెకు కొండంత ధైర్యాన్నిచ్చి ..... దొ ..... దొ ..... దొంగ అంది.

దొంగని కాదు విహారిని అన్నాడు మీ ఇంట్లో అకస్మాత్తుగా ఏదో చప్పుళ్ళు అవుతూంటే అంటూ వివరించబోయాడు.

మీరు దొంగకాదు. లోపల దొంగున్నాడు అంది అతడి మాటలు తుంచేస్తూ కంగారుగా.

దొంగా అంటూ విహారి వంటింటి లోపలికి దూసుకువెళ్ళాడు. ఆ వెళ్ళడంలో వాడు లోపల ఎక్కడున్నదీ చూసుకోలేదు. వెనుకనుంచి వాడు వచ్చి విసురుగా పొడవబోయాడు. ఆమె కెవ్వున  అరిచింది ఆ అరుపుకి వేను దిరిగిన విహారి బలంగా వాడి మొహం మీద చరిచాడు. వాడు వెల్లకిలా పడబోయి తమాయించుకుని ముందుకి దూకాడు. రెండునిమిషాల పాటు భీకర సమరం జరిగింది. చిత్తరువులా నిలబడి చూస్తూండిపోయింది మాల. ఆమెకేం చేయాలో తోచలేదు. ఎంతైనా దొంగ ఇటువంటి విద్యలో ఆరితేరినవాడు. విహారిని ఓవర్ పవర్ చేసి క్రింద పడేసాడు. కత్తి ఎత్తి గుండెల్లో పొడవబోయాడు అప్పుడే స్పృహలోకి వచ్చినట్టు సునాదమాల ఈ దృశ్యం చూసి కెవ్వున అరుస్తూ ముందుకు పరుగెత్తుకు వచ్చి విహారికి అడ్డుగా నిలబడబోయి మీద పడబోయింది.

దొంగ ఈ లోపులో కత్తి దించడం అది సునాదమాల నడుములోకి దిగిపోవడం ఒకేసారి జరిగాయి.

తన శరీరంలోకి కత్తి దిగి పోవడాన్ని ప్రత్యక్షంగా చూసింది క్రింద నున్న విహారి నో ..... నో అని అరుస్తూ ఆమె నడుము పట్టుకున్నాడు. అప్పటికే జరగవలసిన ఘోరం జరిగిపోయింది. అతడి చెయ్యి ఎర్రగా తడిసిపోయింది ఆమెను పక్కకు తోసి లేచి కూర్చున్నాడు. ఆమె మూలిగింది.

తను చేసిన పని హత్యలోకి దిగుతుందని దొంగకూడా వూహించక పోవడంతో భయంతో వణికిపోయాడు. అక్కడనుంచి పరుగెత్తడం సునాదమాల చూసింది.

ఆమె పరిస్థితి ఆందోళనకరంగా ఆగమ్యగోచరంగా తయారైంది బాధ తెలియడం లేదు. అంతా తిమ్మిరెక్కినట్టుంది శరీరం స్వాధీనంలో లేదు కళ్ళనిండా నీళ్ళు కమ్ముకోవడంతో విహారి మసక మసగ్గా కనబడుతున్నాడు. ఈ హడావుడిలో దొంగ పారిపోయినట్టున్నాడు. అలికిడి వినిపిచ లేదు ఆమె కళ్ళు మూసుకుంది. ప్రాణం పోవడం ఇంత తెలిగ్గా వుంటుందా? ఈ బాధలూ తన కాంప్లెక్సులూ ఇవేమీ ఇక వుండవా?

ఉపిరి భారంగా తీసింది

కళ్ళు విప్పింది.

ఆత్రంగా తనవైపే చూస్తున్న విహారి కనబడ్డాడు

ఆమె మనసంతా అదో రకమైన అనిర్వచనీయమైన అనుభూతికి లోనైంది. చనిపోయేటప్పుడు గుక్కెడు తీర్థం నోటిలో పోసేవాడు కావాలని ఎందుకంటారో అర్థమైంది. మనిషికి తోడు అవసరం తెలిసింది విహారి మీద చెప్పలేనంత అభిమానం కలిగింది. తన మీద తనకే జాలి ..... అతడి ప్రేమ మీద ముప్పిరిగొన్న ఆవేశంతో ఏమండీ అంది.

చెప్పండి అన్నాడు అతడు ఆమె తన వాళ్ళకోసం ఏమైనా చెబుతుందేమో అని.

నేను ఇంతకాలం మీ పట్ల ప్రవర్తించిన విధానానికి క్షమించండి. నా మనసులో మీ పట్ల ప్రేమే వుంది కానీ దాన్ని చెప్పడానికి అర్థం లేని భయం ఏదో ..... అమె ఆగి ఏం చెప్పాలో తెలియనట్లు వుండి పోయింది.

..... భయం ఏదో? తలవైపునుంచి ఎవరో ప్రశ్నించారు తరువాత చెప్పమన్నట్టు.

నాకు మగవాళ్ళంటే భయం అసహ్యం కాని మొదటిసారి మిమ్మల్ని చూసినప్పుడే?

మొదటి సారి అంటే ఎప్పుడు? మీదపడుకున్నప్పుడా? విహారి అడిగాడు.

ఆమె సమాధానం చెప్పలేదు.

మరణించే ముందు సిగ్గు అనవసరం. అబద్ధాలు చెప్పకూడదు తలవైపు నుంచి అన్నారు.

అవును మొదటిసారి మిమ్మల్ని చూసినప్పుడే మీరంటే ఇష్టం కలిగింది కానీ మీరు నా వెనుక పడేసరికి మరింత బిగుసుకుపోయాను. టెలిఫోన్ మిషమీద మీరు నన్ను పలకరిస్తున్నారని తెలుసు. నవ్వేయాలని ప్రయత్నించినప్పుడల్లా ఏడుపొచ్చేది. అది నా దు ..... దు ..... దు ..... దు ..... దు ..... ”

దురదృష్టం అందించాడు.

అవును దురదృష్టం మరణించే ముందు సిగ్గు అనవసరం అందుకే చెప్తున్నాను ఐ లవ్యూ విహారి ఐ లవ్యూ.

ముచ్చటగా మూడోసారి చెప్పండి ..... తలవైపు నుంచి వినబడింది.

ఐ ల.... అంటూంటే అనుమానమొచ్చింది ఆమెకు పక్కన విహారి కొంత మాట్లడుతుంటే మరికొన్ని మాటలు తల దగ్గరనుంచి వినబడుతున్నాయేమిటి అనుకుని తలెత్తి చూసింది.

తాపీగా భోజనానికి కూర్చున్నట్టు కూర్చుని వున్నాడు దొంగ. మొహానికి మీసాలు ప్రస్తుతం లేవు.

డొక్కల్లో గాయం సంగతి కూడా మర్చిపోయి ఒక ఉదుటున లేచి కూర్చుంది. దొంగ పలకరింపుగా నవ్వేడు.

నువ్వు ..... నువ్వు ..... అంది.

కాస్త వేషం మార్చేటప్పటికే గుర్తుపట్టలేకపోయాడు మేడమ్ నన్ను పద్మాకర్ అంటారు విహారి స్నేహితుడిని.

ఆమె ఇంకా అయోమయం నుంచి తేరుకోలేదు కడుపు దగ్గర నొప్పి రాకపోవడంతో తడిమి చూసుకుంది.

అది టమోట పండు తాలూకు రసం, మాలా అన్నాడు విహారి ఈ లోపులో పద్మాకర్ జేబులోంచి కత్తి తీసి పొడవగానే అది లోపలికి ఎలా వెళ్లిపోతుందో డిమాన్‌స్ట్రేట్ చేసి చూపించాడు. అప్పటికి అర్థమైంది తనెంత ఫూలిష్‌గా ప్రవర్తించిందో.

మీరూ? అంటూ లేవబోయింది విహారి వారిస్తూ చూడు మాలా రేపే ద్వాదశి నీ మనసులో మాట చెప్పేశావు మళ్ళీ ఇప్పుడు నువ్వు కాదంటే మరో ఛాలెంజ్ చేయడానికి టైంకూడా లేదు అన్నాడు.

ఇంకా ఎందుకు ఈ బిడియం? అంది బామ్మ లోపలికి వస్తూ. మా రోజుల్లో మాకిలాంటి సిగ్గులూ భయాలూ లేవు బాబూ మనసులో ఏముంటే అదే ఏదోరకంగా చెప్పేసేవాళ్లం. డైరెక్టుగా కుదరకపోతే ఇన్‌డైరెక్ట్‌గా.

నిజంగా అంకుల్‌ని ప్రేమిస్తున్నట్టయితే ఇప్పుడు నువ్వు చేతుల్లో మొహం దాచుకుని ఇక్కణ్నుంచి పరుగెత్తాలి ఆంటీ అని సలహా ఇచ్చాడు విష్ణు.

సునాదమాల అలాగే పరుగెత్తింది.

*                    *                    *

ఈరోజు ఏమిటి హుషారుగా వున్నారు? అంది ప్రవల్లిక.

విహారి జవాబు చెప్పలేదు. నవ్వి వూరుకున్నాడు. కారు వెళుతోంది.

చెప్పకూడదా ఏమిటి?

చాలా రోజుల్నించీ ఫోన్‌లో ఏడిపిస్తున్న అమ్మాయి నిన్న బయటపడింది.

ఆమె నవ్వాపుకుని కరెక్ట్‌గా కనుక్కున్నాడే? అంది అయితే మనమింక కిద్వాయ్ గార్డెన్స్ వెళ్ళే అవస ..... ఆమె మాటలు పూర్తికాకముందే అతడు అరె? అన్నాడు

ఏమైంది?

పెట్రోలు ..... అసల్లేదు అంటూ పక్కన బంకులోకి స్టీరింగ్ తిప్పేడు.

ఈ రోజు ద్వాదశి కదూ అందామె రోడ్డువైపు చూస్తూ.

అవును ఏం?

విజయదశమి ఈ రోజే ఈ పులి వేషాలు వేశారేమిటి? అంది.

విజయదశమి వస్తుంది కదా రిహార్సల్స్ వేస్తున్నారేమో? దూరంగా క్యూ వైపు చూస్తూ అన్నాడు. రోడ్డుకి ఒక పక్కగా చిన్న పిలల్లు అయ్యవారికి చాలు అయిదు వరహాలు అని పాడుకుంటూ వస్తున్నారు.

పల్లెల్లో తప్ప చూడమే ఇలాంటి దృశ్యం.

జీతాలు రాని టీచర్లు ఎవరో ఏర్పాటుచేసి వుంటారు నవ్వేడు ..... అందుకే దశమినాడు చెయ్యవలసింది ద్వాదశినాడే ప్రారంభించారు జేబులోంచి వందనోటు తీసి బంకు కుర్రవాడికి ఇస్తూ ఇరవై లీటర్లు అన్నాడు.

బయలుదేరారు?

విహారి సమాధానం చెబుతుండగా దూరంగా ఒక కారు అగింది నల్ల అద్దం కాస్త క్రిందకి దిగింది. అందులో A5 వున్నాడు. వాకీటాకీలో పెట్రోల్ బంకు దగ్గర విహారి వాళ్ళ కారు ఆగినట్టు రామ్‌లాల్‌కి చెప్పాడు అంతకన్నా మంచి అవకాశం రాదు గో ఎహెడ్ అవతల్నించి సూచన వచ్చింది.

పక్క జంక్షన్‌లో మరొకడిని రెడీ చేసి వుంచాడు రామ్‌లాల్.

ఈ లోపులో A5 మెషిన్ గన్ సరిచూకుని కారుని పెట్రోల్ బంక్ దగ్గరగా తీసుకువెళ్ళమన్నాడు.

అయ్యవారికి చాలు అయిదు వరహాలు ..... పిల్లలు పాడుకుంటూ రోడ్ క్రాస్ చేస్తున్నారు.

విహారి కారు దిగి చక్రాల్లో గాలి చూసుకున్నాడు. పద్మాకర్ దూరంగా మోటార్ సైకిల్‌కి గాలి కొట్టిస్తున్నాడు.

విహారి కారు దిగడంతో A5 డ్రయివర్‌కి సైగ చేశాడు. ఇటువంటి హత్యలు చేయడంలో అతడు ప్రొఫెషనల్ అందువల్లే రామ్‌లాల్ అతన్ని నియమించాడు. ఎప్పుడు ఎలా అటాక్ చేయాలో అతడికి బాగా తెలుసు ప్రత్యర్థులు ఇద్దరున్నప్పుడు వారిద్దరూ దగ్గరగా వున్నప్పుడు కాల్చడం మంచిది ఒక రెంజీలో సరిపోతుంది.

డ్రయివర్ బంక్ పక్కగా తీసుకొచ్చి కారు అపాడు.

ఒక హిప్పీ కుర్రాడు జేబులోంచి సిగరెట్ పాకట్‌తీసి దురం నుంచి బంక్‌వైపు నడుచుకుంటూ వస్తున్నాడు పిల్లవాళ్ళకు చాలు పప్పుబెల్లాలు అంటూ పిల్లలు ఇటువైపు వస్తున్నారు.

సాయంత్రం కలుస్తావా? పద్మాకర్ అడిగాడు.

సాయంత్రం ఏమో ..... తనేపనిమీద తీసుకెళ్తాందో తెలీదు. వచ్చేసరికి ఎంతవుతోందో ఏమో?

సరదాగా నటకాలేసుకుంటూ ఈ పిల్లల్లాగా పాడుకుంటూ తిరిగేవాల్లం ఉన్నట్టుండి నీకింత దేశ భక్తి సి.బి.ఐ భక్తీ పుట్టుకొచ్చిన దేమిట్రా?

ముందే చెప్పాను కదా ప్రతివాడూ మానసికంగా ఎప్పుడో ఒకప్పుడు మెచ్యూర్ అవుతాడనీ ఆ అమ్మాయిని చూడు ఇంత చిన్న వయసులో ఎంత బలవంతమయిన శక్తులకు వ్యతిరేఖంగా పోరాడుతోందో దసరా అంటే అదేగా ఒక స్త్రీ శక్తిగా మారి రాక్షసుడ్ని చంపడం విహారి ఇంకా ఏదో చెప్పబోతుంటే అయిపోయింది సార్ అన్నాడు మోటారు సైకిల్‌కి గాలి కొట్టడం పూర్తిచేసిన కుర్రాడు.